క్లుప్తంగా

సత్యనారాయణపురంలో యాగాలు



దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

దెందులూరు: మండలంలోని సత్యనారాయణ పురం గ్రామంలో రామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం నవగ్రహారాధన తీర్థ ప్రసాద వినియోగం పుణ్యాహవాహనం ప్రధాన కుంబాభి ఆరాధన పంచగవ్య ప్రాసన హోమాలు ఘనంగా జరిగాయి. మే 1న మహా కుంభాభిషేకం ఆలయంలో జరుగుతుందని దెందులూరుతోపాటు సమీప మండలాల్లోని భక్తులు మహా కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆలయంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలోఅన్నదానం నిర్వహించారు. మంగళవారం పురష్కరించుకుని 200మందికి నిర్వహించిన ఈ అన్నదానానికి వేలివెన్ను గ్రామానికి చెందిన దాపర్తి ప్రసాద్ మహాలక్ష్మి దంపతులు ఆర్థిక సాయం అందించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఈఓ తారకేశ్వరరావు ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషను నేర్చుకోవాలి



ఆంగ్లభాషను నేర్పిస్తున్న రిసోర్స్ పర్సన్

పెదపాడు: ఆంగ్లభాషను నేర్చుకుని పట్టు సాధించాలని గ్రంథపాలకుడు డీ జాన్‌బాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు రిసోర్స్‌పర్సన్ రవికుమార్ విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. తదనంతరం కథలు చెప్పించడం, చదివించడం జరిగింది. ఈకార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి తీరువా పన్ను వసూళ్లు ముమ్మరం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు నాగరాజు

నిడమర్రు: మండలంలో 24 గ్రామల్లో రూ. 4.14 కోట్లు నీటి తీరువా పన్ను వసూలు చేయాల్సి ఉందని తహసీల్దారు నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ అధికారులు సమావేశంలో ఆయన మాట్లాడారు. 29 వరకూ రూ.21 లక్షలు మాత్రమే నీటి తీరువా పన్నులు వసూళ్లు చేశామన్నారు. మిగిలిన రూ 3.93కోట్లు మే నెల 15లోపు రైతుల నుంచి కట్టించుకునేలా రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలన్నారు. రైతులు ఆయా గ్రామ సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్‌లకు నీటి తీరువా పన్నులు చెల్లించి నేరుగా రసీదు పొందవచ్చన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

గణపవరం: వేసవి దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. గణపవరం మండలం పిప్పర గ్రామ చందా సత్రం వద్ద దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాటసారులకు ఈ చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమన్నారు.

పశువుల్లో పారుడు జ్వరం

దెందులూరు: వేసవిలో పశువులకు పారుడు జ్వరం వస్తున్నాయని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ పోతునూరు వైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు అన్నారు. మంగళవారం పోతునూరు పశు వైద్యశాల కొత్తూరు గ్రామాల్లో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. కొల్లేరు ప్రాంతం వెళ్లి వచ్చిన తర్వాత పశువులకు రైతులు తాగునీరు ఏర్పాటు చేసే విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంవల్ల సహజంగా పారుడు జ్వర లక్షణాలు ఉంటున్నాయన్నారు. పశువులు అనారోగ్యానికి గురైన వెంటనే సమీప పశు వైద్యశాలకు తీసుకువచ్చి పరీక్షలు చేయించి మందులు, ఇంజక్షన్లు చేయించాలని తాగునీరు విషయంలో విధిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ ఆఫీసర్ శ్రీరాములు తెలిపారు.

నిరాశాజనకంగా కొనుగోళ్లు.. గట్టెక్కని కష్టాలు

జోరుగా ఖరీఫ్ పంట ఒబ్బిడి పనులు



ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళా కూలీలు



రోడ్లపైనే ఉన్న ధాన్యం రాశులు

దెందులూరు: ధాన్యం కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 42 వేల ఎకరాలల వరిసాగు ప్రస్తుతం వ్యవసాయం గాలిలో దీపంలా మారింది. ఎప్పుడు ఏ కష్టం వచ్చిపడుతుందో అన్నదాతలకు తెలియడం లేదు. పంట ఇంటికి చేరితేనే ఆ ఏడాది రైతుకు పంట పండినట్లు. ఇక ప్రకృతి వైపరీత్యాలు వస్తే నష్టాలు తప్పనిసరి. ఇలాంటి పరిస్థితుల్లో పండిన పంటను ఒబ్బిడి చేసుకుని అమ్మకాల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతకు చేదు అనుభవం ఎదురవుతుంది. దెందులూరు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 42వేల ఎకరాల్లో వరిసాగు చేయగా అకాల వర్షాల కారణంగా వరి పంట దెబ్బతింది. మిగిలిన పంటను రైతులు కోసినూర్చి అమ్ముకోడానికి ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఎక్కడా వాటి ఆనవాళ్లు కనిపించడం లేదు. తమ దగ్గర ఉన్న ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నా కొనే నాథుడు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

ఎక్కడ చూసినా ధాన్యం రాశులే

నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో సుమారు 18వేల ఎకరాల్లో వరి పంట కొనుగోళ్లు లేక కళ్లల్లోనే ఉండిపోయినట్లు రైతులు వాపోతున్నారు. వివిధ సాకులు చూపిస్తూ అధికారులు ధాన్యం కొనుగోళ్లకు వెనకడుగు వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తే తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో వారికి అమ్మడానికి రైతులు నిరాకరిస్తున్నారు. దీంతో నియోజకవర్గంలో ఏ రోడ్డు పక్కన చూసినా ధాన్య రాశులే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో రోజుకో విధంగా ఉండడంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందో, పండిన ధాన్యం మళ్లీ ఎక్కడ వరదల పాలవుతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి వివరణ కోరగా ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రైతు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవచ్చన్నారు. రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి



ఉపాధి పథకం సూపర్‌వైజర్‌కు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న వైద్యాధికారి

గణపవరం: ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి కూలీలకు తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని, ఉదయం 11 గంటల లోపుగానే పనులు ముగించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఉపాధి కూలీలకు అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపాధి హామీ పథకం సూపర్‌వైజర్‌లకు అందజేశారు. పనుల దగ్గర అవసరమైన పందిళ్లు ఏర్పాటు చేయాలని, మంచినీరు అందుబాటులో ఉంచాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు పని చేసే ప్రదేశం వద్ద అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జాలాదివిల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలి



వాసుబాబును సత్కరిస్తున్న ఉంగుటూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు

గణపవరం: అబద్ధపు హామీలు, మాయమాటలు, ఆచరణ సాధ్యం కానీ పథకాలతో ప్రజలను మోసం చేసి అధికారంలో కూర్చున్న కూటమి నాయకుల బండారాన్ని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ పీఏసి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి పదవులలో నియమితులైన ఉంగుటూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు మంగళవారం వాసుబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమను రాష్ట్రస్థాయి పదవులలో నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాసుబాబును శాలువతో సత్కరించి, బొకే అందించారు. ఈసందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పట్ల ప్రజలలో అభిమానం ఏమాత్రం తగ్గలేదని, కూటమి ప్రభుత్వ అవినీతి, అసమర్థపాలనతో ఆ అభిమానం మరింత బలపడుతుందని అన్నారు. రాబోయే రోజులలో వైఎస్సార్‌సిపిని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ నాయకులు కృషి చేయాలని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిలిపివేసిన పథకాలన్నీ మళ్లీ మనప్రభుత్వం వస్తేనే ప్రజలకు అందుతాయన్న నమ్మకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. వాసుబాబును కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కన్వీనర్ ఎలిశెట్టి పాపారావుబాబ్జీ, రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కన్వీనర్ నడింపల్లి సోమరాజు,రాష్ట్ర మహిళావిభాగం కన్వీనర్ మంద జయలక్ష్మి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ కేతిరెడ్డి విశ్వేశ్వరరావు వాసుబాబును కలిసి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. వీరివెంట నిడమర్రు ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం బుజ్జి, ఎస్‌సి సెల్ జిల్లా కన్వీనర్ తెనాలి సునీల్, చేబ్రోలు ఎంపిటిసి సభ్యుడు మనసాల కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ధనకొండ శ్రీను, నిమ్మల బుజ్జి ఉన్నారు.

కశ్మీర్‌లో ఉగ్ర దాడి అమానుషం



ఉగ్రదాడిలో మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం వహిస్తున్న పెద్దలు, చిన్నారులు

భీమడోలు: జమ్మూ-కశ్మీర్‌లోని పహల్గామ ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడిలో ఆసువులు బాసిన ప్రతి ఒక్కరి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన పునశ్చరణ తరగతుల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం ఉత్సాహబరిత వాతావరణంలో శిక్షణ న్విహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణాంశాలను ఆడుతూ పాడుతూ శిక్షణ పొందారు. భీమడోలు శాఖా గ్రంథాలయం పరిధిలోని భీమడోలు నెం.1 పాఠశాల వద్ద గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానవత జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు నీతి కథలు చెప్పడం, చిన్నారులతో చెప్పించడం, పుస్తక పఠనం, సమీక్షలు వంటి అంశాలను వారికి వివరించారు. అనంతరం కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడిలో మరణించిన పౌరులకు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు ప్రదర్శింపబడిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులు పుస్తక పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను లైబ్రేరియన్ జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయాధికారి రాంబాబు

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు స్థానిక గ్రంథాలయ అధికారి రాంబాబు ఆధ్వర్యంలో జరిగాయి. గ్రామంలోని పాఠశాలల విద్యార్థులకు పుస్తకపఠనం, కంప్యూటర్ పరిజ్ఞానం ఆటల పోటీలు కథలు చెప్పించడం డ్రాయింగ్ క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు. తల్లిదండ్రులు వేసవి సెలవులను తమ పిల్లల సద్వినియోగం చేసుకునేలా బాధ్యతలు తీసుకోవాలన్నారు.

ఉలిక్కిపడ్డ రైతులు



పోలసానిపల్లి వంతెన వద్ద ధాన్యం బస్తాలను ఉంచుతున్న రైతులు

భీమడోలు: వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు గుండెల్లో రైళ్లు పరిగిడుతున్నాయి. మంగళవారం రాత్రి ఒక్కసారిగా ఉరుములతో కూడిన ఈదురు గాలులు వీయడంతో రైతులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కొన్ని ప్రాంతాల్లో చిన్నపాటి వర్షం కురిసింది. వాతావరణ శాఖ విభిన్న వాతారణం ఉంటుందని వెల్లడించడంతో రైతులు పండించిన ధాన్యాన్ని భద్రపర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఎండ, ఆ తర్వాత ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆరుదల కోసం రోడ్లుపై ఆరబోసిన ధాన్యాన్ని రైతులు సాయంత్రం బరకాలతో కప్పి భద్రపర్చుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ఆరుగాలం పండించిన ధాన్యం పూర్తి స్థాయిలో సేకరణ చేయకపోవడంతో ఎక్కడ ధాన్యం అక్కడే దర్శనమిస్తుంది. రోడ్లు, ఖాళీ జాగాల్లో ధాన్యాన్ని ఆరబోశారు. మండలవ్యాప్తంగా ఇప్పటి వరకు 60 శాతం నుంచి 50 శాతం వరకు ధాన్యం రోడ్లపైనే ఉంది. దాళ్వాలో అధిక దిగుబడులు రావడం, పౌరసరఫరాల విభాగం సేకరణ లక్ష్యాన్ని తగ్గించడంతో రైతుల నుంచి ధాన్యం పంట రైస్ మిల్లులకు చేరని పరిస్థితి ఏర్పడింది. రైతులు ప్రభుత్వం కనికరించే వరకు ఎలాంటి ఆపద రాకుండా కొంత మంది రైతులు వంతెన వద్ద ధాన్యం మేట్లు కడుతున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, అపోహలు చెందవద్దని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గోపన్నపాలెంలో రెండు నీట్ పరీక్షా కేంద్రాలు



బూర్ సింగ్ మీనా

దెందులూరు: నీట్ పరీక్షలకు మండలంలోని గోపన్నపాలెం గ్రామంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నీట్ సెంటర్లు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు జారీ చేశారని గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బూర్ సింగ్ మీనా అన్నారు. మంగళవారం కేంద్రీయ విద్యాలయంలో ఆయన మాట్లాడుతూ మే 4న నీట్ పరీక్షలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా హాల్లోకి ఎటువంటి సాంకేతిక పరిజ్ఞాన వస్తువులను అనుమతింబడవని తెలిపారు.

నీట్ పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: గోపన్నపాలెంలో నీట్ పరీక్షా కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాల మేరకు దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి తనిఖీ చేశారు. మే 4వ తేదీన గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నీట్ పరీక్ష జరగనుంది. రెండు విద్యాసంస్థల్లో తాగునీరు, బెంచీలు, విద్యుత్తు, ప్రహరీ, స్లాబ్ ఇతర సౌకర్యాలను పరిశీలించారు. కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపాల్ సింగ్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మనోహర్ సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. 240 మంది విద్యార్థులు కేంద్రీయ విద్యాలయలో, గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులను నీట్ పరీక్షలు రాసేందుకు కేటయించడం జరిగిందని తహసీల్దార్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని ఉన్నారు.

ఏసుప్రభు తిరు హృదయ మహోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ పీ.బాల

పెదపాడు: ఏసుప్రభు తిరు హృదయ మహోత్సవాలను ప్రారంభించడం సంతోషంగా ఉందని ఏలూరు పీఆర్ వికార్ జనరల్ డాక్టర్ పి బాల అన్నారు. మంగళవారం రాత్రి పెదపాడు ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ పొనుగు మాటి మేల్కియర్ రాజు అధ్యక్షతన మూడు రోజులు పాటు జరిగే ఏసుప్రభు తీరు హృదయ మహోత్సవాలు ఆలయ 54వ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభించారు. పెదపాడు తిరు హృదయమహోత్సవాలకు వికార్‌జనరల్ హోదాలో విచ్చేసిన డాక్టర్ పి బాలాకు, ఫాదర్ మిల్క్ ఇయర్, ఫాదర్ పాస్కలి, సహాయఫాదర్ రాజు సంఘ పెద్దలు సంఘస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం దివ్య పూజ బలి అర్పించారు. ఉదయం స్థానిక సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ బోడా యేసుదాసు స్థానిక సీఎస్‌ఐ చర్చి పాస్టర్ మెగాద్రి ఆధ్వర్యంలో రక్షణ సువార్త సదస్సు ఉదయకాల ప్రార్థన స్తుతి ఆరాధన జపమాల నిర్వహించారు.

మేడేను విజయవంతం చేయండి



భీమడోలులో మేడే గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు, నాయకులు

భీమడోలు: మేడేను విజయవంతం చేయాలని సీఐటీయు ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలు సీఐటీయు కార్యాలయంలో మంగళవారం మే డే గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ పేరుతో గత 30 ఏళ్లకు దేశంలో కిర్మాక హక్కులను హరిస్తూ ప్రస్తుతం 8 గంటల పని హక్కుపై పాలకవర్గాలు దాడి చేస్తున్నాయన్నారు. కార్పొరేట్లకు కార్మికుల శ్రమను మరింత దోచి పెట్టేందుకు మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకుని వచ్చి కార్మికులను బానిసలుగా మార్చే చర్యలు చేపట్టడం దారుణమన్నారు. కార్మికులందరిని ఐక్యంగా ఉన్నట్లయితే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు తిప్పి కొడతామని ధీమా వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో మేడే వేడుకలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, మండల నాయకులు ముప్పిరిశెట్టి పానకాలు, కోటా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

3న మెంటల్ అవేర్‌నెస్‌పై సమావేశం



సమావేశ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం, శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమెరికా వారి హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆల్‌తో సంయుక్తంగా మెంటల్ అవేర్నెస్ అనే అంశంపై అంతర్జాతీయ ఆన్‌లైన సమావేశం మే 3న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు తెలియజేశారు. ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడితో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ఇదే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించి మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో అమెరికా దేశంలోని ప్రసిద్ధులైన వైద్య బృందం వివిధ అంశాలపై వెబినార్‌లో చర్చించబోతున్నారని కన్వీనర్ డాక్టర్ కొండ రవి తెలియజేశారు. ఈ సందర్భంగా సమావేశానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.రెడ్డయ్య, కో-ఆర్డినేటర్ బీవీ రెడ్డి, డాక్టర్ పి.బాబురావు, ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అంతం చేయడానికి కృషి



బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమడోలు: బాల్య వివాహాలను అంతం చేసేందుకు సర్వమత పెద్దలు తమ వంతు సహాయ సహకారాలను అందించాలని క్రాఫ్ జిల్లాల కోఆర్డినేటర్ ఆర్. వినోద్‌కుమార్ అన్నారు. గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో చైల్డ్ రైట్స్‌అడ్వకేసి ఫౌండేషన్, క్రాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అక్షయ తృతీయ నాడు బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవడానికి సామూహిక అవగాహన ప్రచారాన్ని నిర్వహించారు. సర్వమత పెద్దలతో బాల్య వివాహాల నిరోధంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలను ఏ మతం ప్రోత్సహించదని, అది ఓ ఆత్యాచారమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.కవిత, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కాకి ఛార్లెస్, ఇమామ్ షేక్ జబీర్, పూజారులు కోడూరి సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు



మేనేజర్ టీ. నాగార్జున

దెందులూరు: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మే ఒకటి నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పేరు మార్చడం జరిగిందని దెందులూరు బ్రాంచ్ మేనేజర్ టి నాగార్జున తెలిపారు. మంగళవారం బ్యాంకు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ భారత ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ నెంబర్ ఎస్ ఓ 16 25 ప్రకారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా చైర్మన్ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఖాతాదారులకు యధావిధిగా సేవలు సాకర్యాలు జరుగుతాయని బ్యాంకు సిబ్బందికి సహకరించాలని జరిగిన మార్పును గమనించాలని మేనేజర్ నాగార్జున సూచించారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

ఉంగుటూరు: వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాజ్‌మనోజ్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం జరిపారు. సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి ఎండల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, జిల్లాస్థాయికి వెళ్తున్న పౌర సమస్యలు గ్రామస్థాయిలోనే పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపీడీఓ కోరారు. పశువులు తొట్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాల ను స్థానిక ప్రజా ప్రతినిధులతో సంప్రదించి మండలపరిషత్‌కు ప్రతిపాదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఓ ఆంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సును ఢీకొన్న మినీ వ్యాను



ప్రమాదంలో దెబ్బతిన్న మినీవ్యాన్

ఉంగుటూరు: మండలంలోని బాదంపూడి వద్ద వై-జంక్షన్‌లో మంగళవారం ఆర్‌టీసీ బస్సును మినీ లారీ ఢీకొంది. తాడేపల్లిగూడెం నుంచి ద్వారకాతిరుమల వెళ్తున్న ఆర్‌టీసీ బస్సును ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వెళుతున్న మినీ లారీ బస్సును మధ్యభాగంలో ఢీకొట్టింది. దాంతో బస్సు మధ్యబాగం లారీ ముందుభాగం బాగా దెబ్బతిన్నాయి.ఈ ప్రమాదంలో 5 గురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుల పరిస్థితి మెరుగ్గానే ఉందని వైద్యులు తెలిపారు. బస్సు కండక్టరు చోడగిరి వెంకటరమణ ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

కూటమి పాలనలో లక్షల కోట్ల అప్పు

భీమడోలు: కూటమి ప్రభుత్వ పాలనలో లక్షల కోట్లు అప్పు చేసి సంక్షేమ పథకాలకు మొండి చేయి చూపిందని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కాలమైన కొత్త పింఛన్లను మంజూరు చేయలేదని మండిపడ్డారు. పేదల విద్యార్థులు తల్లులకు ఇస్తామని తల్లికి వందనం సొమ్ము ఏమైందని ప్రశ్నించారు.మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందాయని, సూపర్ సిక్స్‌తో ప్రజలంతా మోసం పోయారని పేర్కొన్నారు. పునః పరిశీలన పేరుతో దివ్యాంగుల పింఛన్లు ఏరివేత దారుమణమని మండిపడ్డారు.

మ్యారేజ్ స్కీమును వినియోగించుకోవాలి

దెందులూరు: డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మ్యారేజ్ స్కీమును కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని అంబేడ్కర్ సంఘం జాతీయ నాయకులు మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షు డు కనికెళ్లి మురళి, ఎంఆర్‌పీఎస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మురళి అన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు కేంద్రం డాక్టర్ అంబేడ్కర్ ఫౌండేషన్ మ్యారేజ్ స్కీమును ప్రారంభించడం స్వాగతించదగ్గ విషయమన్నారు.